www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 11 డిసెంబర్ 2024



హెల్మెట్ తప్పనిసరి

జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం



మాట్లాడుతున్న కరీం

ఏలూరు స్పోర్ట్స్ : ప్రతిఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం అన్నారు. ఏలూరు నగరంలోని సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 475 రోడ్డు ప్రమాదాలు జరుగుగా వాటిలో 144 మంది ద్విచక్ర వాహనాలు నడిపే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారన్నారు. అందులో 85 మంది ద్విచక్ర వాహనదారులు మృతి చెందారని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థిదశ నుంచే రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నో హెల్మెట్ నో ఎంట్రీ ఫ్లెక్సీలను కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. అధికారులు జి.ప్రసాదరావు, జగదీష్, పి.నరేంద్రబాబు పాల్గొన్నారు.

చలికాలం సర్దుబా(పో)టు..!

కరెంటు బిల్లుల భారం జనాలకు తెలియకుండా ప్రభుత్వం కుయుక్తులు పన్నింది. చలికాలం విద్యుత్ వినియోగం తక్కువగా ఉన్న సమయంలో సర్దుబాటు భారాలకు పూనుకుంది. ప్రస్తుతం డిసెంబర్‌లో వచ్చిన బిల్లును పరిశీలిస్తే అసలు విషయం అర్థమవుతోంది. విద్యుత్ వినయోగం తగ్గినా కరెంటు బిల్లులు ఎక్కువగా రావడానికి కారణం ఇదే. ప్రస్తుత కరెంటు బిల్లులో ఎఫ్‌పిపిసిఎ (ఫుల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్టమెంట్) ఛార్జీలు రెండు కనిపిస్తాయి. ఇక ఇతర ఛార్జీలు షరా మామూలే. వాడుకున్న కరెంటు కంటే అదనపు ఛార్జీల భారమే మోత మోగుతోంది. దీంతో చిరువ్యాపారులు, గృహ వినియోగదారులు లబోదిబోమంటున్న పరిస్థితి.

- జనం నుంచి వ్యతిరేకత రాకుండా ప్రభుత్వం కుయుక్తులు
- చలికాలంలో విద్యుత్ వినియోగం తగ్గినా బిల్లులు తగ్గని పరిస్థితి
- అదనపు ఛార్జీల పేరుతో కరెంటు బిల్లులు షాక్
- ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల ముసుగులో బాదుడే బాదుడు
- ప్రస్తుత బిల్లులో రెండు ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు
- చిరు వ్యాపారులు, గృహ వినియోగదారులు విలవిల

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం పోయి టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలవుతోంది. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలకు, ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు ఏమాత్రం తేడా లేదు. గడిచిన ఐదేళ్ల పాలనలో ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో వైసిపి దాదాపు తొమ్మిదిసార్లు జనాలపై కరెంటు ఛార్జీల భారం మోపగా, కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే రెండుసార్లు కరెంటు భారాలు మోపింది. డిసెంబర్‌లో తీసిన కరెంటు బిల్లుల్లో ఇప్పటికే ఒక ఛార్జీ పడగా, జనవరి నుంచి మరో అదనపు ఛార్జీ జత కానుంది. అదనపు ఛార్జీల భారంపై జనాల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు ప్రభుత్వం కుయుక్తులతో ముందుకు సాగుతోంది. చలికాలం విద్యుత్ వినియోగం తక్కువగా ఉంటుంది. దీంతో కరెంటు బిల్లు తక్కువగా రావాలి. ఎక్కడా అటువంటి పరిస్థితి లేదు. గత బిల్లుకంటే కొంతమందికి ఎక్కువగా రాగా, మరికొంత మందికి గత బిల్లుకంటే కొద్దిమొత్తం తేడాలో కరెంటు బిల్లులు వచ్చాయి. కరెంటు ఎక్కువగా వాడకపోవడంతో భారీగా బిల్లులు తగ్గుతాయని భావించిన జనాలకు ఏమాత్రం ఊరట లేకపోయింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 12 లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. పెద్దఎత్తున చిరు వ్యాపారులు ఉన్నారు. వీరంతా డిసెంబర్ రెండో తేదీ నుంచి తీస్తున్న కరెంటు బిల్లులు చూసి తలలు పట్టుకుంటున్నారు. విద్యుత్ వినియోగం తగ్గినా బిల్లులు పెద్దఎత్తున ఎందుకు వచ్చాయో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం వస్తున్న విద్యుత్ బిల్లును పరిశీలనగా చూస్తే అసలు విషయం అర్థమవుతోంది.



PRES KVAH 17893
PREV KVAH 17768
BILLED UNITS 125
AVG UNITS 150
RMD 0.72KVA
VR 238.7 IR :1.8
VY 227.3 IY :0.0
VB 231.2 IB :0.0
ENERGY CHRG 878.75
DEMAND CHRG 532.50
CUST CHRG 45.00
ED 120.00
SURCHARGES 0.00
ED INT 0.00
TRUEUP CHRG 0.00
FPPCA CHRG 0.00
FPPCA2 CHRG 62.00
ADJ AMOUNT 0.00
SHORT FALL 0.00
ACD SURCHRG 0.00
GRID SUPP CHRG 0.00
LOSS/GAIN -0.25
BILL AMOUNT 1638.00
GOVT SUBSIDY 0.00
NET AFTSUB 1638.00
ISD-TDS : 0.00
ARREARS
BEF 01/04/24 0
AFT 01/04/24 0
NET AMT 1638.00
DUE DATE 17-10-2024
DISC DATE 02-11-2024

PRES KVAH 18187
PREV KVAH 18038
BILLED UNITS 149
AVG UNITS 137
RMD 1.88KVA
VR 242.2 IR
VY 240.7 IY
VB 235.3 IB
ENERGY CHRG 1095.95
DEMAND CHRG 532.50
CUST CHRG 45.00
ED 145.00
SURCHARGES 0.00
ED INT 0.00
TRUEUP CHRG 0.00
FPPCA CHRG 103.42
FPPCA2 CHRG 50.00
ADJ AMOUNT 0.00
SHORT FALL 0.00
ACD SURCHRG 0.00
GRID SUPP CHRG 0.00
LOSS/GAIN 0.13
BILL AMOUNT 1972.00
GOVT SUBSIDY 0.00
NET AFTSUB 1972.00
ISD-TDS : 0.00
ARREARS
BEF 01/04/24
AFT 01/04/24
NET AMT 1972.00
DUE DATE 20-12-2024
DISC DATE 05-01-2025

జిరాక్స్ షాపుకు గత నెలలో రూ.1,638 కరెంటు బిల్లురాగా, ఈ నెల రూ.1972 వచ్చిన బిల్లులు

2021-22కు సంబంధించిన సర్దుబాటు భారం ఎఫ్‌పిపిసిఎ2 పేరుతో కరెంటు బిల్లులో భారం కన్పిస్తోంది. 2022-23కు సంబంధించిన సర్దుబాటు భారం డిసెంబర్ బిల్లులో ఎఫ్‌పిపిసిఎ పేరుతో మరో భారం మోపారు. ఇవికాకుండా డిమాండ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ఇడి వంటి ఛార్జీలు వేశారు. దీంతో విద్యుత్ వాడకం తగ్గినా కరెంటు బిల్లు మాత్రం తగ్గలేదు. దీంతో ఏలూరులోని ఓ జిరాక్స్ షాపునకు గత నెలకంటే బిల్లు అదనంగా రావడంతో సదరు యాజమాని తల పట్టుకుంటున్నాడు. ఆ షాపునకు బిల్లు మొత్తం రూ.1972 రాగా అందులో అదనపు ఛార్జీల భారం రూ.875 వరకూ ఉంది. చిరువ్యాపారులకు సంబంధించిన ఏ బిల్లు చూసినా ఇదే పరిస్థితి ఉంది. గృహ వినియోగదారుల పరిస్థితి ఇదేవిధంగా ఉంది. చాలామందికి ప్రభుత్వం చేస్తున్న కుట్ర అర్థంకాని పరిస్థితి. ఎఫ్‌పిపిసిఎ పేరుతో మోపుతున్న భారం గురించి చాలామంది జనాలకు తెలియడం లేదు. తాము అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు పెంచబోమని కూటమి పార్టీలు చెప్పాయి. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే జనాలపై భారం మోపింది. దీంతో కరెంటు ఛార్జీల నుంచి అన్నింటి ధరలూ పెరిగిపోవడంతో ఒక కాపీ జిరాక్స్‌కు రూ.మూడు వసూలు చేయడంతో ప్రజలపై పెనుభారం పడుతోంది. హోటల్స్, ఇతర వస్తువులు విక్రయించే దుకాణాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

గత బిల్లుకంటే ఎక్కువగా వచ్చింది


జిరాక్స్ వ్యాపారి, ఏలూరు

మాది జిరాక్స్ షాపు. కమర్షియల్ కేటగిరీలో విద్యుత్ కనెక్షన్ ఉంది. గత నెలలో రూ.1638 కరెంటు బిల్లు వచ్చింది. ఈ నెల ఎసి వంటివి ఏమీ వాడకపోయినా రూ.1972 కరెంటు బిల్లు వచ్చింది. శీతకాలం బిల్లు తగ్గాల్సి ఉండగా పెరిగింది. ఇంత పెద్దమొత్తంలో అదనపు ఛార్జీలు వేస్తే వ్యాపారాలు ఏవిధంగా చేయాలో అర్థం కావడం లేదు.

ఎఫ్‌పిపిసిఎ భారం ఒక్కటే రూ.218

గృహ వినియోగదారుడు

ఈ నెల కరెంటు బిల్లు రూ.1100 వచ్చింది. అందులో ఎఫ్‌పిపిసిఎ భారం రూ.218 వచ్చింది. ఇక ఫిక్స్‌డ్, కస్టమర్ ఛార్జీలు, ఇడి, సర్‌ఛార్జీల కింద రూ.115 వరకూ పడ్డాయి. దాదాపు రూ.330కుపైగా అదనపు భారం బిల్లులో రావడం జరిగింది. ఇలాగైతే మాలాంటి సామాన్య ప్రజానీకం ఎలా బతకాలో ప్రభుత్వమే చెప్పాలి.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ఉద్యమాలే ఊపిరి

- మరోసారి విశిష్టతను చాటుకున్న పిడిఎఫ్
- గెలిచిన తెల్లారే సిపిఎస్ ఉద్యమంలోకి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై పోరాటాలే తమ ఊపిరి అని పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మరోసారి చాటుకున్నారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా గెలుపొందిన పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి సోమవారం సాయంత్రం ఎన్నిక ధ్రువీకరణపత్రాన్ని అందుకున్న 24 గంటలు గడవక ముందే సిపిఎస్ ఉద్యమంలో భాగస్వాములై పిడిఎఫ్ విశిష్టతను చాటారు. విజయవాడలో ఎపి సిపిఎస్ఇఎ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన సిపిఎస్ వ్యతిరేక ఉద్యమంలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొని ఉద్యోగ, ఉపాధ్యాయులకు అండగా నిలబడ్డారు. సాధారణంగా ఎంఎల్‌సి, ఎంఎల్ఎగా గెలిచిన వెంటనే అలసిపోయామంటూ రిలాక్స్ అవుతుంటారు. లేకపోతే సేద తీరేందుకు వేరే ప్రాంతానికి వెళ్తుంటారు. అయితే పిడిఎఫ్ ఎంఎల్‌సి గోపీమూర్తి మాత్రం దానికి భిన్నంగా ఉద్యమంలో పాలుపంచుకోవడం విశేషం. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోసం ఆది నుంచి పోరాటం చేస్తున్నామని, ఇది రద్దయే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను ఒకే తాటిపైకి తీసుకొచ్చి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

అంతర్ జిల్లా దొంగలు అరెస్టు

రూ.70 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం - జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్



స్వాధీనం చేసుకున్న ఆభరణాలతో ఎస్‌పి, డిఎస్‌పి, సిఐలు


ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్న దొంగల ముఠాను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ వెల్లడించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో భీమడోలు, గణపవరం, ఉండి, ఆకివీడు ప్రాంతాల్లో ఇళ్లలో చోరీ ఘటనలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయన్నారు. నిందితుల కోసం గాలిస్తుండగా మంగళవారం నలుగురు ముఠా సభ్యులు పోలీసులకు తారసపడ్డారని, వారు వివిధ చోరీ కేసుల్లో నిందితులని గుర్తించారని తెలిపారు. వారిని వెంటనే అదుపులోకి తీసుకుని 700 గ్రాముల బంగారు ఆభరణాలను, ఏడు కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామానికి చెందిన కట్టిరెడ్డి మణికంఠసాయి శ్రీనివాస్, యార్లపాటి మౌని సన్నీ అలియాస్ సన్నీ, పెద్ద హేమకుమార్ అలియాస్ హేమంత్, పెద్దిరెడ్డి రత్నశేఖర్‌లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు విభాగాలు సమన్వయంతో పని చేయడంతో దొంగలను అదుపులోకి తీసుకున్నామన్నారు. చోరీ కేసుల విషయంలో క్లూస్ టీమ్, సిసిఎస్ పోలీసులు, ప్రత్యేక బృందాలు ఉత్తమ సేవలందిస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఈ కేసులో అరెస్ట్ అయిన నలుగురు నిందితులపై పాత కేసులేవీ లేవని, ఒకే గ్రామానికి చెందిన వీరు బృందంగా చోరీలకు పాల్పడుతున్నారని వివరించారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.70 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. రూ.63 వేలు నగదు కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజలు ఇళ్ల నుండి బయట ప్రాంతాలకు వెళ్తున్న సమయంలో కచ్చితంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, లేదంటే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా పోలీసు శాఖ తరపున వారి ఇళ్లకు కాపలా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కేసులో అత్యంత ప్రతిభ కనబరిచిన నిడమర్రు సిఐ సుభాష్, భీముడోలు సిఐ యుజె.విల్సన్, భీమడోలు ఎస్ఐ సుధాకర్, గణపవరం ఎస్ఐ మణికుమార్, చేబ్రోలు ఎస్ఐ సూర్య భగవాన్, నిడమర్రు ఎస్ఐ వీరప్రసాద్‌లను ప్రత్యేకంగా అభినందించారు. వీరికి ప్రశంసా పత్రాలను కూడా అందించారు.

ఎంఎల్‌సిగా గోపీమూర్తి గెలుపుపై సంబరాలు


ప్రజాశక్తి - చింతలపూడి

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి గెలుపుపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పురేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇది ఉపాధ్యాయుల అందరి విజయమన్నారు. అప్పారావు మాట్లాడుతూ గోపీమూర్తి ద్వారా ఉపాధ్యాయుల గొంతు శాసనమండలిలో విన్పిస్తారన్నారు. పిఆర్‌టియు నాయకులు సుంద్రు రాజేంద్ర మాట్లాడుతూ ఎంఎల్‌సి గోపీమూర్తి ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికై కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ధారవత్తు కీమ్యా, కోడూరి శ్రీనివాసరావు, మాటూరి చక్రధరరావు, కె.దామోదర్, కాకర్ల సత్యం, కంచర్ల బుచ్చిబాబు, చంచం రాజు, నత్తా ప్రేమ్‌కుమార్, బి.శేఖర్, శ్రీనివాసరావు, పాండురంగారావు, అవినాష్, నజీర్ ఆలీ, హేమ్లానాయక్, తలారి రవిచంద్ర, మరీదు శ్రీనివాసరావు, జె.రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడిలో..

టి.నరసాపురం: ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అఖండ విజయం సాధించడం పట్ల యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.అప్పారావు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన టి.నరసాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కేక్ కట్ చేసి విజయోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథి అప్పారావు మాట్లాడుతూ గోపీమూర్తి విజయం కార్పొరేట్ శక్తులకు చెంపపెట్టన్నారు. ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గుడెల్లి వెంకట్రావు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు జి.లక్ష్మణరావు, ఆర్‌విజి.కృష్ణారావు, కె.బాలకృష్ణ, టి.రామాంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



టి.నర్సాపురంలో..

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి - మండవల్లి

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, బిల్లులను సకాలంలో చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని విద్యుత్ శాఖ గుడివాడ డివిజన్ ఇఇ జిపి.శ్రీనివాసరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండవల్లి మండల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారన్నారు. విజిలెన్స్ ఇఇ సిహెచ్.వాసు ఆధ్వర్యంలో సిబ్బందిని 45 బృందాలు ఏర్పాటు చేసి వినియోగదారుల గృహాలను, వాణిజ్య సముదాయాలను ఆక్వా చెరువులపై ఉన్న మీటర్లను పూర్తిస్థాయిలో తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో 286 సర్వీస్ మీటర్లలో అదనపు లోడ్ ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. అదనపు లోడు వినియోగిస్తున్న వారిపై రూ.8.95 లక్షలు జరిమానా విధించామని తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో గుడివాడ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.రామయ్య, ఎఇ రామకృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించాలి

పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతులు సేంద్రీయ ఎరువులు వినియోగించడం లాభదాయకమని చింతలపూడి ఎడిఎ బి.నాగ కుమార్ తెలిపారు. మండలంలోని వల్లంపట్ల గ్రామంలో స్థానిక వ్యవసాయ అధికారిణి బి.సుమలత ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ ఇ-పంట నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులు వాడి భూసారాన్ని పెంపొందించుకోవాలన్నారు. సూక్ష్మ బిందు సేంద్యం ప్రోత్సహించుటకు ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరుబోయిన శ్రీనివాస్, చవల అప్పలరాజు, సత్యనారాయణ, అయ్యప్ప పాల్గొన్నారు.



టి.నరసాపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎడిఎ నాగకుమార్

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని పల్లెర్లమూడి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌కె.హబీబ్ భాష పాల్గొని పర్యవేక్షించారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పొలం పిలుస్తుంది కార్యక్రమం వల్ల సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందజేస్తున్నామన్నారు. రైతుల సమస్యలు తెలుసుకుని క్షేత్రస్థాయి పరిష్కారం తెలుపుతున్నామని అన్నారు. విత్తనాలు మొక్కజొన్న రైతులు ఖచ్చితంగా ఒప్పంద పత్రం కంపెనీ వారి వద్ద నుంచి తీసుకోవాలని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో రైతులు మొక్కజొన్నకు ఎకరాకు రూ.483 ప్రీమియం చెల్లించి ఎన్రోల్మెంట్ చేసుకోవాలని అన్నారు. దీనివల్ల పంట దిగుబడులు లేక వాతావరణ పరిస్థితులు అనుకూలించని ఎడల రైతుకు నష్టం వాటిల్లినచో రూ.42 వేలు బీమా వర్తిస్తుందని తెలిపారు. మొక్కజొన్నకు కూడా ఈ పథకం అమలు కాబడుతుందని తెలిపారు. రైతులు భూసార పరీక్ష ఫలితాల విశ్లేషణ పత్రం ద్వారా తగినంత మోతాదు ఎరువులను వినియోగించి, సాగు ఖర్చు తగ్గించుకొని, నాణ్యమైన పంటను పొందాలని సూచించి, భూసార పరీక్ష కార్డులను రైతులకు అందజేశారు. చెరకు పంటలో యాజమాన్యంపై రైతులకు పలు సందేహాలను నివృత్తి చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎఫ్‌టిఒ పొందిన వెంటనే వారి ఖాతాలో సొమ్ము జమ చేయబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు వ్యవసాయ సహాయ సంచాలకులు విద్యాసాగర్, మండల వ్యవసాయ అధికారి ఎ.చాముండేశ్వరి, విహెచ్ఎ హర్షియా, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై డిఎల్‌పిఒ విచారణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

బొర్రంపాలెం పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై జంగారెడ్డిగూడెం డిఎల్‌పిఒ రజావుల్లా మంగళవారం విచారణ నిర్వహించారు. స్థానిక ఇఒపిఆర్‌డి, ఫిర్యాదుదారుడు పాండురంగాతో కలిసి ఆక్రమణకు గురైన సాయినగర్ వాటర్ ట్యాంక్ స్థలం, బల్క్ మిల్క్ సెంటర్ స్థలం, సూరంపూడిలో బొమ్మగాని బాలకృష్ణ పొలం నుండి వడ్లాని వెంకటేశ్వరావు పొలం వరకు గ్రావెల్ రోడ్డు వేయకుండా వేసినట్లు బిల్లులు చేసుకున్న రోడ్డును పరిశీలించారు. వీటిపై త్వరితగతిన నివేదికలు తయారు చేసి డిపిఒకు పంపనున్నట్లు రజావుల్లా తెలిపారు. ఆక్రమణకు గురైన స్థలాలు సర్వే చేసి స్వాధీనం చేసుకునే విధంగా చర్యలు చేపడతామన్నారు.



విచారణ చేస్తున్న డిఎల్‌పిఒ

మానవ హక్కుల చట్టం ద్వారా మానవాభివృద్ధి

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మానవ హక్కుల చట్టం ద్వారా మానవ అభివృద్ధి సాధ్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ స్థానిక సత్రంపాడులోని జూనియర్ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1948 డిసెంబర్ 10వ తేదీన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆమోదించబడిందని తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మానవ హక్కుల దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబర్ 10వ తేదీన జరుపుకుంటున్నామని అన్నారు. భారతదేశంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ 1993లో మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993 ప్రకారం స్థాపించబడిందని, దీని ప్రకారం జాతీయత హక్కు, ఏకపక్ష అరెస్టుకు వ్యతిరేకంగా హక్కు, ఏ రూపంలోనైనా బానిసత్వాన్ని నిషేధించడం, కదలిక, నివాసం, స్వేచ్ఛ, మరెన్నో హక్కులను ఈ చట్టం ద్వారా ప్రజలకు అందుబాటులో తెచ్చారని తెలియజేశారు. మానవ అభివృద్ధికి ఈ చట్టం ఒక మైలురాయి వంటిదని, ఇది సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ప్రధానమైనది, మానవ హక్కులు, గౌరవం లేనప్పుడు స్థిరమైన అభివృద్ధి సాధ్యం కాదన్నారు. సుస్థిర అభివృద్ధి, మానవ హక్కులు పరస్పరం ఆధారపడి ఉంటాయని, ఇది మానవ హక్కుల పురోగతిపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో అందరికీ సమాన హక్కు, హామీ ఇవ్వడం ద్వారా భారతదేశ రోల్ మోడల్‌గా ఉండేందుకు కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ చట్టం ద్వారా ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా జీవించడానికి, మాట్లాడడానికి, అభివృద్ధి చెందడానికి ఎంతో ఉపయోగపడుతుందని, ఈ హక్కులతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యతతో మెలగాలని సూచించారు. నేటి సమాజంలో మాదకద్రవ్యాలు యువతపైన దుష్ప్రభావం చూపిస్తున్నాయని, కావున విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, తెలిసోతెలియకో మాదకద్రవ్యాలకు సంబంధించిన వస్తువులను చేరవేయడం కూడా శిక్షార్హమైందన్నారు. విద్యార్థులు చెడు స్నేహాలకు పోకుండా విద్య పైన దృష్టి వుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు మూడో పట్టణ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, ప్యానల్ లాయర్లు కూన కృష్ణారావు, పి.వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ భుజంగరావు, ఇంగ్లీషు లెక్చరర్ భాస్కరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

మిషనరీ వసతి గృహ ఘటనపై దర్యాప్తు చేయాలి

దోషులను కఠినంగా శిక్షించాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు మిషనరీ వసతి గృహంలో బాలిక ప్రసవం ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి, దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆధ్యాత్మిక సంస్థలో బాలిక గర్భవతి అయినా పట్టించుకోకపోవడం దుర్మార్గమని, దీనికి ఆ సంస్థ నిర్వాహకుల నిర్లక్ష్య వైఖరే కారణమని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఏలూరులోని అశోక్ నగర్‌లో గల ఓ మిషనరీ సంస్థలో ఆదివారం బాలిక ప్రసవించిన ఘటన దారుణమన్నారు. బాలిక గర్భవతి అయ్యి ప్రసవం వరకూ నిర్వాహకులకు తెలియకపోవడం అంటే పర్యవేక్షణాలోపం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని అన్నారు. రోజురోజుకూ మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలే దయానంద సరస్వతి బాలికల వసతిగృహంలో ఘటనను మర్చిపోకముందే ఇంకొక ఘటన వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, విచారణ త్వరితగతిన పూర్తి చేసి దోషులను శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా పోలీస్ ఉన్నతాధికారులను రవి డిమాండ్ చేశారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని 12 పంచాయతీలలోని రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 11 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ కె.స్టీఫజీజ్ తెలిపారు. 11న పులికపాడు, 12న జగన్నాధపురం, 13న వీరంపాలెం, అంకన్నగూడెం, 16న తాటియాకులగూడెం, 17న జల్లేరుగూడెం, 18న లంకలపల్లి, 19న రాచన్నగూడెం, 20న గోపాలపురం, 21న కామయ్యపాలెం, 23న బొత్తప్పగూడెం, 24న పి.అంకంపాలెం, 26న పి.నారాయణపురం, 27న రౌతుగూడెం, 28న ములగలంపల్లి, 30న గంగన్నగూడెం, జనవరి 2న స్వర్ణవారిగూడెం, ఇంద్రిక పాడు, 3న తాటియాకులగూడెం, బర్రింకలపాడు, 4న రామన్నపాలెం, పి.అంకంపాడు, 6న జీలుగుమిల్లి, మడకంవారిగూడెం, 7న దర్భగూడెం, దాట్లవారిగూడెం, 8న వంకవారిగూడెం, దానవాయిపేట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కొత్త లైసెన్సుల జారీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో 27 మండలాల్లోని గ్రామపంచాయతీల పరిధిలోని లేఅవుట్లు, భవన నిర్మాణ ప్లానులు తయారుచేయుట, పర్యవేక్షణ చేయు నిమిత్తం 2025వ సంవత్సరానికి ప్రభుత్వ ఉత్తర్వులు నెం.67, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, 26.02.2002 ప్రకారం కొత్త లైసెన్సులు జారీచేయుట, పాత లైసెన్సులను రెన్యూవల్ చేయుట జరుగునని జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్కిటెక్ట్, ఇంజినీర్, సర్వేయర్-1, సర్వేయర్-2 లుగా చేయబడునన్నారు. కావున ఈనెల 11వ తేదీ బుధవారం నుంచి జిల్లా పంచాయతీ అధికారి, ఏలూరు వారి కార్యాలయంలో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య పనిదినములలో అభ్యర్థులు దరఖాస్తు ఫారములు ఉచితంగా పొందవచ్చన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 11వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జిల్లా పంచాయతీ అధికారి, ఏలూరు వారి కార్యాలయ పనిదినములలో స్వీకరించబడునన్నారు. ఈనెల 29 నుంచి ఎటువంటి దరఖాస్తులు స్వీకరించబడవని తెలిపారు. ఈ ప్రకటన కేవలం లైసెన్సు నిమిత్తం మాత్రమే జారీచేయబడినది, ఇది ఉద్యోగ ప్రకటన కాదని, అభ్యర్థులు గమనించాలని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల యూనియన్ ఎన్నిక

ప్రజాశక్తి - ముసునూరు

మండల పంచాయతీ కార్యదర్శుల యూనియన్ ఎన్నిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించినట్లు యూనియన్ కోశాధికారి పి.నాగబాబు చెప్పారు. మంగళవారం మండల కేంద్రమైన ఎంపిడిఒ కార్యాలయంలో యూనియన్ ఎన్నిక నిర్వహించగా అధ్యక్షులుగా శ్రీనివాస్ వేల్పుచర్ల గ్రామపంచాయతీ సెక్రెటరీ, ఉపాధ్యక్షులుగా ఆరేపల్లి వెంకటేశ్వరరావు గోపవరం పంచాయతీ కార్యదర్శులను ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి పి.నాగబాబు పత్రికా ముఖంగా తెలియజేశారు.

'ప్రతిరోజూ వ్యాయామం చేయాలి'

ప్రజాశక్తి - ముసునూరు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ప్రతిరోజూ, నిత్యం వ్యాయామం చేసినట్లయితే మానసిక, శారీరక ఆరోగ్యకరంగా ఉంటారని ఫిజియోథెరపిస్టు జె.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రమణక్కపేట మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ శిబిరం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టిలు ఉపాధ్యాయులు డిఎంఐ లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

గిరిజనేతరుల భూములను తొలగించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో గిరిజన చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులు కొన్న భూములకు ఆన్‌లైన్ చేసిన భూములను రికార్డుల నుంచి తొలగించాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జె.బాబ్జి డిమాండ్ చేశారు. మంగళవారం పోలవరం నిర్వాసితుల సమస్యలపై నిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మీ సేవ కేంద్రం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమణకు వినతి పత్రాన్ని అందజేశారు. మీడియం వెంకటస్వామి, మూలెం రాంబాబు, గుజ్జ బాబురావు, తామా సింగన్న దొర, మండలంలోని ఎర్రవరం, వాడపల్లి, నిర్వాసిత గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్రంలో కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి నగర అధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేసి, నగరపాలక సంస్థ కమిషనర్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏలూరు కార్పొరేషన్ పరిధిలో పర్మినెంట్ మున్సిపల్ కార్మికులకు, జనరల్ ఇంక్రిమెంట్లు, స్పెషల్ ఇంక్రిమెంట్లు, మెడికల్ లీవ్ బిల్లులు, రిటైర్మెంట్ అయిన వారికి రావాల్సిన లీవ్ క్యాష్ మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఫిబ్రవరి నెల హెల్త్ అలవెన్స్ చెల్లించాలని, మున్సిపల్ పర్మినెంట్ కార్మికులకు ప్రతి ఏడాది భోగి పండగ రోజు యూనిఫారం, కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు, కుట్టుకూలీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డిగర్ల నాగబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు యలగాడ శివకుమార్, బంగారు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పని మనిషిగా చేరి..

302 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఇంట్లో పనిచేస్తూ యజమానురాలి వస్తువులను ఒక్కొక్కటిగా దొంగలించుకుపోయి యజమానులకు ఎటువంటి అనుమానం రాకుండా వ్యవహరిస్తూ, చివరకు పోలీసులకు చిక్కిన ఆ పనిమనిషి కటకటాల పాలైంది. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని మూడో పట్టణ పరిధిలో శాంతినగర్‌కు చెందిన ఎర్రంశెట్టి సురేష్ తల్లికి కేర్‌టేకర్‌గా ఉండేందుకు ఒక మహిళను పనిమనిషిగా కుదుర్చుకున్నాడు. సత్రంపాడు ప్రాంతానికి చెందిన చింతా అనిత వెంకటలక్ష్మి అలియాస్ అనిత అనే మహిళ గతంలో వన్‌గ్రామ్ గోల్డ్ వ్యాపారం చేసి బాగా నష్టపోయింది. దీంతో పనిమనిషిగా చేరింది. ప్రతిరోజు ఆమెకు సేవలు చేస్తూనే ఇంట్లో బీరువాలో దాచి ఉంచిన ఒక్కొక్క బంగారు వస్తువును అపహరించడం మొదలుపెట్టింది. కొద్ది రోజులకు అపహరించిన కొన్ని బంగారు వస్తువులను తాకట్టు వ్యాపారి వద్ద తాకట్టు పెట్టింది. ఇదంతా ఇంటి యజమానురాలు తన ఇంట్లో బంగారం దొంగతనం గురవుతుందని తెలియకుండా ఉండేందుకే ఒక్కొక్కటిగా దొంగతనం చేస్తూ వచ్చింది. ఒక్కసారిగా ఇంటి యజమానురాలు తన బీరువాలో ఉండవలసిన బంగారు నగలను తనిఖీ చేయగా అపహరణకు గురైనట్లు గుర్తించింది. వెంటనే యజమానురాలి కుమారుడు సురేష్ మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మడో పట్టణ పోలీసులు అనితను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి 302 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపుగా రూ.18 లక్షలుగా ఉంది. ఈ కేసులో త్వరితగతిన బంగారం రికవరీ చేసిన మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావును, ఎస్‌ఐ రాంబాబులను జిల్లా ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. వారికి ప్రశంస పత్రాలను కూడా అందించారు.

బెల్ట్ షాప్ నిర్వాహకునిపై కేసు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని రమణక్కపేట గ్రామములో జరిపిన దాడులలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న కంటే రాంబాబు తండ్రి పుల్లయ్య వద్ద నుంచి(6) మద్యం సీసాలను స్వాదీన పరచుకొని, కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఎ.అవులయ్య వారి ఆదేశాల మేరకు మంగళవారం దాడులు నిర్వహించినట్లు తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

కుక్కునూరు: మండలంలోని వేలేరు గ్రామంలో పామిలేరు నది గట్టున సారాయి తయారీకి సిద్ధంగా వున్న 1000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీను బాబు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్‌ఐ ఎస్ఎన్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి

ఆర్గానిక్ ఫుడ్స్ తీసుకోవాలి

ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ గీతిక

చిట్ చాట్



ప్రజాశక్తి - ఏలూరు సిటీ

గర్భిణులు జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని, ఆర్గానిక్ ఫుడ్స్ తీసుకోవాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ బి.గీతిక సూచించారు. గర్భాశయ సమస్యలు ఉన్నవారికి తగిన సూచనలు ఇస్తూ ప్రజాశక్తి ద్వారా ఆమె పలు సందేహాలను నివృతి చేశారు.

ప్రశ్న : ఆరోగ్యకరమైన శిశువు జన్మించాలంటే గర్భం దాల్చిన నాటి నుంచి ఒక మహిళ ఎలాంటి ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలి?

గైనకాలజిస్ట్ : ముందుగా గర్భిణులు ప్రెగ్నెన్సీ టెస్ట్‌ను ఇంట్లోనే చేసుకుని కన్ఫామ్ చేసుకున్న తర్వాత డాక్టర్‌ను సంప్రదించాలి. డాక్టర్స్ ఇచ్చే సలహాలను తప్పనిసరిగా పాటించాలి. మంచి ఆహారాన్ని తీసుకోవాలి. సాధారణ స్త్రీ కన్నా గర్భిణులకు 300 కిలోల క్యాలరీస్ అదనంగా అవసరం ఉంటుంది. ప్రోటీన్ ఫుడ్ అధికంగా ఉండాలి, అందులో వెజిటేబుల్స్, ఫ్రూట్స్ అధికంగా ఉండేలా చూసుకోవాలి. నాన్‌వెజ్ తినే వారైతే ఫిష్‌ని తింటే చాలా మంచిది. సప్లమెంటేషన్‌లో రోజూ ఐరన్, కాల్షియం, విటమిన్ డి టాబ్లెట్స్ తప్పనిసరిగా వేసుకోవాలి. నిద్ర కనీసం 8 గంటలైనా ఉండాలి. ఎటువంటి స్ట్రెస్ లేకుండా ఉంటే ఆరోగ్యకరమైన శిశువు జన్మించడానికి ఆస్కారం ఉంది.

ప్రశ్న : ప్రస్తుత సమాజంలో సహజ ప్రసవాలు తగ్గి, ఆపరేషన్ సంఖ్య రెట్టింపు కావడానికి గల కారణాలు?

గైనకాలజిస్ట్ : పూర్వకాలంలో ఎలాంటి వైద్యశాల అందుబాటులో లేక అధిక ప్రసవాలను భరించేవారు. కానీ నేడు తల్లికి, బిడ్డకు సమస్యలు రావద్దు, ఎందుకంటే ఒకరు లేదా ఇద్దరికే జన్మనిస్తున్నారు కాబట్టి, తల్లికి, బిడ్డకి ఇబ్బంది లేకుండా ఆరోగ్యంగా ప్రసవం కావాలి అన్న పరిస్థితుల్లో అటు కుటుంబ పెద్దలు, గర్భిణులు ఆపరేషన్ వైపు మొగ్గు చూపుతున్నారు. కొందరు మహిళలు నొప్పులు భరించడానికి ఇబ్బంది పడుతూ ఆపరేషన్ దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రస్తుత కాలంలో శారీరక శ్రమ లేకుండా సున్నితంగా పెరగడం వల్ల డెలివరీలు అయ్యే ఎల్విస్ సరిగా అభివృద్ధి చెందడం లేదు. అందుకే సహజ ప్రసవానికి ఇబ్బంది అవుతుంది. ప్రధానంగా సహజ ప్రసవానికి అమ్మాయిలు మానసికంగా సిద్ధంగా లేరు. పుట్టే పిల్లలు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యంగా ఉండడానికి వైద్యులపై సిజేరియన్స్‌కి ఒత్తిడిని తెస్తున్నారు. అనారోగ్య సమస్యల వల్ల కూడా సిజేరియన్ వైపు అడుగులు వేస్తున్నారు.

ప్రశ్న : లేటు వయసులో పెళ్లి చేసుకున్న దంపతులకు సకాలంలో సంతానం కలగకపోవడానికి గల కారణాలు?

గైనకాలజిస్ట్ : ఈవిధంగా ప్రెగ్నెన్సీ కలగకపోవడాన్ని ఇన్ ఫెర్టిలిటీ అని అంటాం. మనం ట్రీట్మెంట్ చేసిన సమయంలో వీటిలో మోడీపై చేసేవి కొన్ని, చేయలేనివి కొన్ని ఉంటాయి. అమ్మాయిలకి వయసు 30, అబ్బాయిలకి 40 సంవత్సరాలు దాటిన తర్వాత గమిట్స్ విడుదల సంఖ్య క్రమంగా తగ్గిపోతూ వస్తుంది. అలా తగ్గిపోవడం వల్ల ప్రెగ్నెన్సీ రావడానికి తక్కువ అవకాశాలు ఉంటాయి. ఒకవేళ వచ్చినా అబార్షన్ అవ్వడానికి అవకాశం ఎక్కువ ఉంటుంది. ఒకవేళ బిడ్డ జన్మించినా అవయవాల లోపం ఉంటుంది.

ప్రశ్న : కొంతమంది గర్భిణులకు ఆరు లేక ఏడు నెలలకు ముందే డెలివరీ కావడానికి గల కారణాలు? కొన్ని సమయాల్లో ఇలా పుట్టిన శిశువులు మరణిస్తున్నారు దానికి గల కారణం?

గైనకాలజిస్ట్ : ఆరు లేదా ఏడు నెలలకు ముందే బిడ్డలు జన్మించడాన్ని ప్రీ టర్మ్ డెలివరీస్ అంటాం. ఇలా జరగడానికి మొదటి కారణం ఇన్‌ఫెక్షన్స్. నెలలు పూర్తిస్థాయిలో నిండక ముందే డెలివరీకి గల కారణం గర్భాశయ లోపలు కూడా ఉంటాయి. గర్భసంచి చిన్నగా ఉండడం, తగిన సైజులో లేకపోవడంతో పాటుగా దాని ఆకారం తేడాగా ఉండడం, గర్భాశయం లోపల అడ్డుగోడలు ఉండడం, గర్భాశయ ముఖద్వారం వదులుగా ఉండడం కూడా ఒక కారణమే. తల్లికి సరైన న్యూట్రిషన్ అందకపోయినా ఇలా జరగడానికి అవకాశం ఉంది. నెలలు నిండకముందు 28 వారాల తర్వాత జన్మించిన శిశువులను బతికించే అవకాశాలు ఉన్నాయి. కానీ అంతకన్నా తక్కువగా ఉంటే చెప్పలేం.

ప్రశ్న : పుట్టబోయే పిల్లలకు తల్లిదండ్రుల నుంచి వంశపారంపర్యంగా జబ్బులు వస్తాయా? రాకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

గైనకాలజిస్ట్ : తల్లిదండ్రులకు ఏవైనా జెనెటిక్ డిసీజెస్ ఉంటే పిల్లలకు రావడానికి ఆస్కారం ఉంది. బిపి, షుగర్ లాంటివి పిల్లలకు రాకుండా ఉండాలంటే జీవన విధానంలో మార్పులు చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. దాంతో వీటిని కొంతవరకు నివారించేందుకు అవకాశం ఉంది.

ప్రశ్న : కవల పిల్లలు పుట్టడానికి గల కారణాలు?

గైనకాలజిస్ట్ : అండం, వీర్య కణం కలిసి బేబి ఏర్పడే సమయంలో అండాలు రెండుగా చీలిపోయి కవలలు ఏర్పడతారు. ఇది సహజంగా జరిగే పద్ధతి. ఇక ఐవిఎఫ్, టెస్ట్ ట్యూబ్ బేబి పద్ధతిలో చికిత్స తీసుకునే సమయంలో కవలలు పుట్టడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే మనం ఆ పద్ధతిలో ఎంబ్రియోస్ లోపల ప్రవేశ పెట్టడం వల్ల ఆ సమయంలో కవలలు పుట్టే అవకాశం ఉంది. కొందరు దంపతులు కవల పిల్లలు కావాలని వస్తున్నారు. తల్లి వైపు నుంచి వంశపారంపర్యంగా కవల పిల్లలు పుట్టినా.. కవలలు పుట్టడానికి అవకాశం ఉంది.

ప్రశ్న : గర్భిణులు ఆరోగ్యంగా ఉండడానికి మీరు ఇచ్చే సలహాలు, సూచనలు?

గైనకాలజిస్ట్ : ముందుగా జీవన విధానాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. ఇంటి ఆహారం తీసుకోవాలి, మంచి ఆహారం, గాలి, నిద్రతో పాటుగా వ్యాయామం అవసరం ఎంతైనా ఉంది. స్వచ్ఛమైన పాలు, కూరగాయలు తినాలి. ప్లాస్టిక్ గ్లాసు, పేపర్ ప్లేట్స్ గ్లాసులు కూడా వాడకూడదు. ఆర్గానిక్ ఫుడ్ తీసుకుంటే చాలా మంచిది. మన జీవన గడియారాన్ని ఆటంకపరిచే పనులు చేయకూడదు.

క్షీణిస్తున్న మానవ హక్కులు

ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హైమావతి, శ్యామలారాణి

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పలుచోట్ల అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భారతదేశంలో మానవహక్కులు క్షీణిస్తున్నాయని, ప్రపంచవ్యాప్తంగా 165 దేశాల్లో 109వ స్థానంలో మనదేశం ఉందని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలరాణి అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక 44వ డివిజన్లో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలరాణి మాట్లాడుతూ రోజురోజుకీ మహిళల హక్కుల పరిస్థితి ఇంకా దిగజారుతుందన్నారు. భేటీ బచావో అని చెప్పే ప్రభుత్వం రాజ్యాంగ స్థానంలో మనుధర్మశాస్త్రాన్ని తెచ్చి మహిళలు పోరాడి సాధించుకున్న హక్కుల్ని నీరుగార్చే ప్రయత్నంలో ఉందని, ఆడపిల్లలకు ఇంట, బయట ఎక్కడా రక్షణ లేదని, పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నిరోధానికి కమిటీ ఉండాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలున్నా ఎక్కడా అవి ఉనికిలో లేవని, దీనికి ఉదాహరణే కోల్‌కతా ట్రెయినీ డాక్టర్‌పై ఘోర ఉదంతం అని అన్నారు. మహిళలపై పెరుగుతున్న హింసను, దౌర్జన్యాలను అరికట్టి, దేశ పరువు, ప్రతిష్టలు నిలబట్టేందుకు ఇప్పటికైనా ఈ ప్రభుత్వాలు పూనుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు జి.శారద, అరుణ కుమారి, స్థానిక కమిటీ నాయకులు జి.సోనిక, ఎన్.మహాలక్ష్మి, టి.సుకన్య, బి.ఇందుమతి పాల్గొన్నారు.



ఏలూరు అర్బన్ : మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఐద్వా నేతలు

చింతలపూడి : ఈ దేశ మానవ హక్కుల మహనీయుడు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని, రాజ్యాంగం కల్పించిన మానవ హక్కుల గొప్పతనాన్ని వివరిస్తూ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడిలో కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్, ఎన్ఎస్ఎస్ యూనిట్, డిపార్ట్మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ ఏలూరు వారు సంయుక్తంగా మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మనిషికి గౌరవం, మానవత్వం మానవ హక్కుల ద్వారా ప్రసాదించబడతాయని అన్నారు. అనంతరం సెట్వెల్ సిఇఒ కెఎస్.ప్రభాకర్ రావు మాట్లాడుతూ సమాజంలో అందరికీ సమాన అవకాశాలు, సమానత్వం మానవ హక్కుల ద్వారా మాత్రమే పొందుతాయని తెలియజేశారు. అనంతరం వెకేషనల్ గైడెన్స్ అండ్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వి.వరలక్ష్మి మాట్లాడుతూ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. యువత మానవ హక్కులతో పాటు క్రిటికల్, క్రియేటివ్ థింకింగ్ అలవాటు చేసుకోవాలని ఎన్‌సిఎస్ యంగ్ ప్రొఫెషనల్ జి.ప్రవీణ్ కృష్ణ శిక్షణ ఇచ్చారు. డిపార్ట్మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ యువతకు చేస్తున్న సేవల గురించి సెట్వెల్ సూపరిటెండెంట్ కెజె.కెన్నడి తెలియజేశారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు కె.హరి ప్రసాద్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్‌జెకె.నరేంద్ర కుమార్, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ సయ్యద్ మీర్ అసీమ్, అధ్యాపకులు డాక్టర్ డి.దేవానందం, బి.శ్రీనివాస రావు, డాక్టర్ అంజద్ ఆలీ, రత్న కుమారి, శంకర పోలయ్య, రాజాబాబు, డాక్టర్ సరస్వతి, డాక్టర్ లవకుశ, విన్నితేజ, సంతోషరావు, పార్వతి, సురేష్, అచ్చిబాబు, మహాలక్ష్మి, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

కుల, మత, రాజకీయ ఏవిధమైన వివక్షకు గురికాకుండా ఉండే హక్కు మానవ హక్కుల ప్రకటనను ఐక్యరాజ్యసమితి 1948 డిసెంబర్ 10వ తేదీన ప్రకటించిందని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు అన్నారు. చింతలపూడి మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఛైర్మన్ జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా చింతలపూడి పట్టణంలోని అర్పణ జూనియర్ కాలేజ్‌లో కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. చింతలపూడి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.నాగేశ్వరావు, ఎన్.అశోక్ బాబు, ఎఎస్ఐ కిషోర్ కుమార్, చింతలపూడి కోర్ట్ అడ్వకేట్స్ పి.డేవిడ్ రాజు పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని తుమ్మగూడెం గ్రామంలో ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంపా వెంకట్రావు మానవహక్కుల గురించి విద్యార్థులతో చర్చించారు. హక్కులు అడిగితే వచ్చేవి కావు, పోరాటం ద్వారానే సాధించుకోవాలని, ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, మానవహక్కుల స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి

కైకలూరు సిఐ రవికుమార్

మండవల్లి : సీసీ కెమెరాలతో నేరాలను కట్టడి చేయొచ్చునని కైకలూరు సిఐ రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక నాగేంద్ర స్వామి కళ్యాణమండపంలో మంగళవారం నిర్వహించిన సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 500 మందికి ఒక పోలీస్ ఉంటే కంట్రోల్ చేయగలమని, కానీ మన వ్యవస్థలో ఐదు వేల మందికి ఒక పోలీసు కూడా లేరని అన్నారు. ఎక్కడైనా దొంగతనం జరిగితే 30 లేదా 40 శాతం మాత్రమే రికవరీ చేయగలుగుతున్నామని, అదే సీసీ కెమెరా ఉంటే దోషులను గుర్తిస్తే ఎక్కువ మొత్తంలో రికవరీ అవకాశం ఉంటుందని అన్నారు. వ్యాపారస్తులు విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరా ఉంటే 24 గంటలు నిఘా ఉన్నట్లే అన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే ఏదైనా కేసు దర్యాప్తులో చాలా ఉపయోగకరమైన సమాచారాన్ని అందిస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఆధునిక సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయని, సమయం కాని సమయంలో అపరిచితులు మన ఇంటి చుట్టుపక్కల సంచరించిన సమయంలో మన ఫోన్‌కు అలారం సౌండ్ అందజేస్తుందన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే ప్రజలు దాని వైపై కనెక్షన్ పోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేస్తే పోలీసు వారి పర్యవేక్షణ కూడా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలపై దృష్టి సారించి ఏర్పాటు చేసుకొని, నేర నియంత్రణకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామచంద్రరావు, మాజీ సర్పంచి గుడివాడ చిట్టిబాబు, రంగుల ఆదినారాయణ, సామాజికవేత్త, ప్రొఫెసర్ సుధాపత్ర విజయకుమార్, పలువురు పెద్దలు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.


అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

పోలవరం డిఎస్‌పి వెంకటేశ్వరరావు

జీలుగుమిల్లి : సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సంధర్బంగా స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కేసులు పెట్టాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ పి.నవీన్ కుమార్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

మండల కార్యదర్శి శ్రీను



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మండల కమిటీ సభ్యులు

కుక్కునూరు : ఈనెల 13, 14, 15వ తేదీల్లో బుట్టయగూడెంలో జరిగే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి బియ్యన శ్రీను పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఎం మండల కమిటీ సమావేశం వర్స వీరస్వామి అధ్యక్షతన సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. సమావేశం అనంతరం సిపిఎం జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను సిపిఎం మండల కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ నిరంతరం పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న సిపిఎం జిల్లా మహాసభలు మొట్టమొదటిసారిగా ఏజెన్సీ ప్రాంతంలోని బుట్టాయగూడెం గ్రామంలో జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలో కార్మికులు, నిర్వాసితులు, ప్రజలు అందరూ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేస్తారని, ప్రజలంతా 13వ తేదీన జరిగే బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిపిఎం మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్, మేడిపల్లి బాబు, షేక్ వలిపాషా, శ్యామల లక్ష్మణరావు, పట్ల లక్ష్మయ్య, పులదాసు రమేష్ పాల్గొన్నారు.

వాటర్ ఇంజిన్ ఏర్పాటుకు ఎంఎల్‌ఎ ఆర్థిక సాయం

ఏలూరు సిటీ : రైతే దేశానికి వెన్నెముక అని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. దేశానికి అన్నంపెట్టే అన్నదాతల కష్టాన్ని విని ఆయన చలించిపోయారు. ఆ కష్టాన్ని తీర్చేందుకు తానే అప్పటికప్పుడు ఒక నిర్ణయం తీసుకుని, ఆ సమస్యకు పరిష్కార మార్గం చూపారు. ఏలూరు వెంకటాపురం గ్రామానికి చెందిన రైతులు తమ సమస్యలను మంగళవారం ఎంఎల్ఎ బడేటి చంటి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను ఆయన క్షుణ్ణంగా విని తెలుసుకున్నారు. పంట చివరి దశలో ఉన్న వరి పొలాలకు కాలువ నీరు అందడం లేదని రైతులు తెలుపగా, ఎంఎల్ఎ స్పందించారు. పంటకు నీరు అందించేందుకు వాటర్ ఇంజిన్ ఏర్పాటు చేసుకోమంటూ రైతులకు తన సొంత నిధులతో ఆర్థిక సాయం అందించారు. వారి సాగునీటి సమస్యకు వేగవంతమైన పరిష్కారం అందించండంతో ఎంఎల్ఎ చంటి తీరుపట్ల రైతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బారగడ వెంకటేశ్వరరావు, కడమటి వీరబాబు, నెరుసు గంగరాజు పాల్గొన్నారు.

రోబోటిక్స్‌పై వర్క్‌షాప్

నూజివీడు టౌన్ : ఆర్‌జియుకెటి నూజివీడు, టిహాన్ ఐఐటి హైదరాబాద్ సహకారంతో ఎస్ఎసి ఆడిటోరియంలో ఐఒటి, రోబోటిక్స్ ఫర్ అటానమస్ నావిగేషన్ సిస్టమ్స్‌పై మొదటి దశ వర్క్‌షాప్ మంగళవారం విజయవంతంగా ప్రారంభమైంది. ఈ ఒక వారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డిపి)ని ఆర్‌జియుకెటి వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రయివేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ రామస్వామి అధికారికంగా ప్రారంభించారు. సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు, డ్రోన్‌లు, స్వయం ప్రతిపత్తి రోబోట్‌లు వంటి రంగాల్లో ఈ సాంకేతికతలు మూలంగా ఉన్నాయి. మొదటి దశ పూర్తయిన తర్వాత, రెండవ దశ కార్యక్రమంలో 400 మంది విద్యార్థులు(ఒక్కో క్యాంపస్ నుంచి 100 మంది విద్యార్థులు) పాల్గొంటారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలలో అధ్యాపకులు, విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడం ద్వారా సైద్ధాంతిక పరిజ్ఞానం, ఆచరణాత్మక అనువర్తనం మధ్య అంతరాన్ని తగ్గించడంలో ఈ చొరవ సహాయపడుతుంది. ఆర్‌జియుకెటి వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ విజయ కుమార్ తన ప్రసంగంలో డ్రోన్ టెక్నాలజీ సామర్థ్యాన్ని, ముఖ్యంగా కోవిడ్-19 మహమ్మారి సందర్భంలో హైలైట్ చేశారు. మహమ్మారి సమయంలో మందులు, అత్యవసర సామాగ్రి వంటి అవసరమైన సేవలను అందించడానికి, ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలో, క్లిష్టమైన పరిస్థితులలో సాంకేతికత విలువను ప్రదర్శించడానికి డ్రోన్‌లను ఎలా సమర్థవంతంగా ఉపయోగించారో ఆయన తెలిపారు. ఈ ఏడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి)లో 50 మంది శిక్షకులకు శిక్షణ ఇవ్వాలనే ప్రోగ్రామ్ లక్ష్యాన్ని కూడా ఆయన పంచుకున్నారు. రామస్వామి, వైస్ ప్రెసిడెంట్, ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రయివేట్ లిమిటెడ్, ఇంజినీరింగ్ టెక్నాలజీ రోజురోజుకూ విపరీతంగా పెరుగుతోందని చెప్పారు. ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర కుమార్, డైరెక్టర్, డాక్టర్ బి.లక్ష్మణరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.శ్యామ్, డాక్టర్ రియాజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పీతల జయ భారతి భర్త : రవింద్రబాబు అను నేను పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం కొండపల్లి గ్రామానికి చెందిన అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయింది. పొన్నపల్లి గ్రామం నుండి మార్టేరు మీదుగా ఓడూరు వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు మార్గమధ్యంలో పడిపోయినది. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ : E5247322 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఏడల ఈ క్రింది అడ్రస్ తెలియజేయగలరు.

పీతల జయభారతి, భర్త : రవింద్రబాబు
డోర్ నెంబర్ : 2 -7 -23 /1
పొన్నపల్లి, నరసాపురం మండలం,
ప.గో.జిల్లా. సెల్ : 7569212464

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.103/2021

Between:
బ్యాంకు ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ రి.బై బ్రాంచ్ మేనేజర్ ...వాది
అండ్
కాటూరి సూరిబాబు వగైరా ...ప్రతివాదులు
టు
2వ ప్రతివాది :
తిరుమాని వెంకటేష్, తండ్రి ములాస్వామి,
డోర్‌నెం.5-133, యాళ్ళవానిగరువు,
పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నంబరు దావాను మీపైన వాది బ్యాంకు వారికి రావలసిన బాకీ రాబట్టుకొనుటకు గానూ మీపైన మరియు 1వ ప్రతివాది పైన శ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం 2వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున, శ్రీకోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ ది.07-01-2025 తేదికి వాయిదా వేసియున్నారు. కావున 2వ ప్రతివాది అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ది.07-01-2025 సం॥రం తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

అడబాల సుబ్రహ్మణ్యం B.Com., B.L.
అడ్వకేట్, నరసాపురం, ప.గో.జిల్లా.
నరసాపురం స్టాండింగ్ కౌన్సిల్ ఫర్ బ్యాంకు
తేది.09-12-2024 ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.154/2019

Between:
బ్యాంకు ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ రి.బై బ్రాంచ్ మేనేజర్ ...వాది
అండ్
మాదేటి నరసింహస్వామి వగైరా ...ప్రతివాదులు
టు
1వ ప్రతివాది :
మాదేటి నరసింహస్వామి, తండ్రి రామాను
జయదాసు, డోర్‌నెం.4-18, యాళ్ళవానిగరువు,
పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నంబరు దావాను మీపైన వాది బ్యాంకు వారికి రావలసిన బాకీ రాబట్టుకొనుటకు గానూ మీపైన మరియు 2వ ప్రతివాది పైన శ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం 1వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున, శ్రీకోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ ది.07-01-2025 తేదికి వాయిదా వేసియున్నారు. కావున 1వ ప్రతివాది అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ది.07-01-2025 సం॥రం తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

అడబాల సుబ్రహ్మణ్యం B.Com., B.L.
అడ్వకేట్, నరసాపురం, ప.గో.జిల్లా.
నరసాపురం స్టాండింగ్ కౌన్సిల్ ఫర్ బ్యాంకు
తేది.09-12-2024 ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.164/2019

Between:
బ్యాంకు ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ రి.బై బ్రాంచ్ మేనేజర్ ...వాది
అండ్
మాదేటి నరసింహస్వామి వగైరా ...ప్రతివాదులు
టు
1వ ప్రతివాది :
మాదేటి నరసింహస్వామి, తండ్రి రామాను
జయదాసు, డోర్‌నెం.4-18, యాళ్ళవానిగరువు,
పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నంబరు దావాను మీపైన వాది బ్యాంకు వారికి రావలసిన బాకీ రాబట్టుకొనుటకు గానూ మీపైన మరియు 2వ ప్రతివాది పైన శ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం 1వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున, శ్రీకోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ ది.07-01-2025 తేదికి వాయిదా వేసియున్నారు. కావున 1వ ప్రతివాది అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ది.07-01-2025 సం॥రం తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

అడబాల సుబ్రహ్మణ్యం B.Com., B.L.
అడ్వకేట్, నరసాపురం, ప.గో.జిల్లా.
నరసాపురం స్టాండింగ్ కౌన్సిల్ ఫర్ బ్యాంకు
తేది.09-12-2024 ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్